www.prajasakti.com
ప్రజాశక్తి
ఆదివారం 29 జనవరి 2023
5
తిరుపతి

శ్రీసిటీ సిద్ధార్థ లాజిస్టిక్స్ పరిశ్రమకు అవార్డు

ప్రజాశక్తి - వరదయ్యపాళెం

శ్రీసిటీకి చెందిన సిద్ధార్థ లాజిస్టిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ పరిశ్రమకు 2021-22 ఆర్థిక సంవత్సరంలో 'అతిపెద్ద దిగుమతిదారు' అవార్డు దక్కింది. అంతర్జాతీయ కస్టమ్స్ దినోత్సవం 2023 సందర్భంగా విశాఖపట్నంలో జరిగిన ఓ కార్యక్రమంలో విజయవాడ కస్టమ్ ప్రివెంటివ్ కమిషనరేట్ కార్యాలయం కస్టమ్స్ అండ్ సెంట్రల్ ట్యాక్సస్ చీఫ్ కమిషనర్ నుండి సిద్ధార్థ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్ నిశ్చల్ పాధ్య అవార్డును అందుకున్నారు. ఏడాదిలో సిద్ధార్థ లాజిస్టిక్స్ రూ. 1.47 లక్షల కోట్ల దిగుమతులతో పాటు రూ. 16,293 కోట్ల దిగుమతి సుంకం చెల్లించింది. తమ సిబ్బంది అత్యుత్తమ పనితీరు, సమిష్టి కషికి గుర్తింపుగా ఈ ఘనత దక్కిందని నిశ్చల్ పాధ్య పేర్కొన్నారు. సిద్ధార్థ లాజిస్టిక్స్ బందానికి శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి అభినందనలు తెలిపారు.

పైలెట్ ప్రాజెక్టుగా క్యాన్సర్ స్క్రీనింగ్ : సిఎస్

ప్రజాశక్తి - తిరుపతి సిటి

వైద్య రంగంలో తిరుపతికి అత్యంత ప్రాధాన్యత ఉందని , జిల్లా అధికారులు, స్విమ్స్, టాటా కాన్సర్ ఆసుపత్రులు సంయుక్తంగా ప్రణాళికా బద్ధంగా కాన్సర్ నివారణ వైద్య చికిత్సలు అందించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవాహర్ రెడ్డి సూచించారు. శనివారం మద్యాహ్నం స్థానిక శ్రీ పద్మావతీ అతిధి గహంలో ఎస్.వి. ఆయుర్వేద , స్విమ్స్, టాటా కాన్సర్ ఇన్స్టిట్యూట్ (స్వికార్), పద్మావతీ చిన్న పిల్లల హదయాలయ ఆసుపత్రుల డాక్టర్లు,అధికారులతో తిరుపతి, చిత్తూరు జిల్లాల కలెక్టర్లలు కె.వెంకటరమణా రెడ్డి, ఎం.హరినారాయణన్ లతో కలసి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సమీక్ష నిర్వహించారు. సి.ఎస్. మాట్లాడుతూ తిరుపతిలో వైద్యశాలలు, విద్యాలయాలు విశాఖతో సమానంగా అత్యధికంగా ఉన్నాయని , ఖర్చులతో కూడిన కాన్సర్ నివారణ, చికిత్సకు ప్రాధాన్యమిచ్చే విధంగా సమన్వయము తో పనిచేయాలని అన్నారు. ప్రతి రెండు వేల జనాభాకు ఒక సచివాలయం ఉందని, అందులో ఎ.ఎన్.ఎం., ఎం.డి.హెచ్ మరో ఎ.ఎన్.ఎం. లు అందుబాటులో ఉన్నారని, వీరి సహాయంతో ఆసుపత్రుల క్యాంపుల నిర్వాహణ చూడాలన్నారు. 'సహకరించండి.. తెలపండి' అనే నినాదంతో కాన్సర్ పేషంట్ల గుర్తింపు జరగాలని, ప్రథమ స్థాయిలో నివారించగలిగితే ప్రాణ రక్షణ, ఆర్థిక భారం తగ్గించిన వారమవుతామని అన్నారు. ఎస్.వి. ఆయుర్వేద వైద్య శాల ఆద్వర్యంలో 63 రకాల మందులు నరసింగాపురం వద్ద ప్రారంభించడానికి సిద్ధమవ్వడం శుభసూచకమని అన్నారు. సాంప్రదాయ వైద్యం ఆయుర్వేదం కేరళ స్థాయికి తిరుపతి చేరే విధంగా కాన్సర్ నివారణ కు రూపుదిద్దుకోనున్నదని అన్నారు. చిత్తూరు జిల్లాకు సంబంధించి సి.ఎం.సి. ఆసుపత్రి వారిని కూడా భాగస్వాములు చేయాల్సి ఉంటుందని అన్నారు. స్విమ్స్, టాటా కాన్సర్ ఆసుపత్రి డాక్టర్లు చేపడుతున్న మెడికల్ క్యాంపులు అందిస్తున్న వైద్య సేవలు సి.ఎస్. కు వివరించారు. క్యాన్సర్ కణాలు గుర్తించి వాటి దుష్ఫలితాల పై అవగాహన కల్పించాలని అన్నారు. ఇప్పటివరకు పింక్ బస్సులు స్విమ్స్, టాటా మహిళలకు ప్రాధాన్యత ఇస్తున్నారని, ప్రణాలికాబద్దంగా సచివాలయ స్థాయి నుండి స్కానింగ్ పరిశీలించారని అన్నారు. రాష్ట్రంలో ప్రారంభంకానున్న కొత్త 23 మెడికల్ కళాశాలల్లో ఆంకాలజీ తప్పనిసరి చేయాలని సి.ఎం. ఆదేశించారని అన్నారు. ఈ కార్యక్రమంలో స్విమ్స్ డా.జయ చంద్రా రెడ్డి, డా.రామ్, స్వికార్ డా.నాగేశ్వర రెడ్డి, చిన్నపిల్లల ఆసుపత్రి డా.శ్రీనాథ రెడ్డి, ఎస్.వి. ఆయుర్వేదిక్ వైద్య శాల సూపరింటెండెంట్ రేణు దీక్షిత, ఆర్డీఓ కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

'ఆదరణ'తో ఆదుకుంటాం..!

రెండో రోజు బీసీలతో నారా లోకేష్ ముఖాముఖి

ప్రజాశక్తి - గుడిపల్లి / శాంతిపురం

గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా జగన్మోహన్‌రెడ్డి బీసీలకు వెన్నుపోటు పొడిచారని, తాము అధికారంలోకి వస్తే ఆదరణ-2 తీసుకొచ్చి చేతివృత్తులను కాపాడతామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ విమర్శించారు. రెండో రోజు పాదయాత్రలో భాగంగా నారా లోకేష్ పీఇఎస్ మెడికల్ కాలేజీ సమీపంలో నిర్మాణంలో ఆగిపోయిన వాల్మీకి, కురుబ కమ్యూనిటీ హాల్స్‌ను పరిశీలించారు. వైసిపి ప్రభుత్వం కక్షపూరితంగా ఆపేసిందన్నారు. కమ్యూనిటీ హాల్లో బెల్టుషాపు నిర్వహిస్తూ ఆకతాయిల అడ్డాగా మారిపోయిందన్నారు. కార్పొరేషన్లకు ఒక్క లోన్ అందలేదని, కమ్యూనిటీ హాల్స్ నిర్మాణం ఆగిపోతే కురబ కార్పొరేషన్ ఛైర్మన్ ఏం చేస్తున్నారని ప్రశ్నించారు. తాము అధికారంలోకి వచ్చిన వెంటనే మూడు నెలల్లో భవనాల నిర్మాణం పూర్తి చేస్తామన్నారు.

ఉదయం 11 గంటలకు పోదూరు గ్రామం వద్ద శాంతిపురం మండలంలోనికి ప్రవేశించింది. కడపల్లి సమీపంలోని శివపురం వద్ద బీసీల ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బీసీ కులాలకు చెందిన పలువురు పలు సమస్యలను ఆయన దృష్టికి తీసుకొచ్చారు. దీనిపై స్పందిస్తూ జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి రాగానే 34 శాతం ఉన్న బీసీ రిజర్వేషన్‌ను 24 శాతానికి కుదించారన్నారు. ఫలితంగా 16వేల మంది స్థానిక సంస్థల్లో పోటీచేసే అవకాశాన్ని కోల్పోయారన్నారు. తాము ప్రమాదబీమాను 10 లక్షలకు పెంచుతామన్నారు. ఆదరణ-2 తీసుకొచ్చి పనిముట్లు ఇస్తామని చెప్పారు. అనంతరం కనుమలదొడ్డి మీదుగా మర్రనపల్లి వద్దకు వచ్చి భోజనం చేశారు. అనంతరం తులసినాయనపల్లి వద్ద మరోసారి బీసీలతో సమావేశమయ్యారు. సాయంత్రం ఆరు గంటలకు పెద్దబొమ్మనపల్లి వద్ద ఉన్న వాదులచెరువు సమీపంలో పాదయాత్రకు విరామం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో

ఆయన వెంట కొల్లు రవీంద్ర, అమరనాథ్‌రెడ్డి, స్థానిక నాయకులు మాజీ ఎంఎల్‌సి గౌనివారి శ్రీనివాసులు, మండల అధ్యక్షులు విశ్వనాథ్‌నాయుడు, సర్పంచి విజయరామిరెడ్డి, మాజీ వైస్ ఎంపిపి ఉదయ్‌కుమార్, నాయకులు నాగరాజు, మణి, శివశంకర్ పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ విద్యార్థులతో...

'స్కాలర్‌షిప్స్ అందడం లేదు. విద్యాదీవెన, వసతి దీవెన అంటున్నారు తప్ప డబ్బులు రావడం లేదు. కొత్త కోర్సులు పెట్టారు కానీ ల్యాబ్‌లు ఏర్పాటుచేయలేదు. బస్సులు తగినన్ని లేక ఇబ్బందులు పడుతున్నాం.. తాగునీరు లేదు' అంటూ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు నారా లోకేష్ చెంత మొరపెట్టుకున్నారు. పాదయాత్రలో పాల్గొని సంఘీభావం తెలియజేశారు.

విషమంగానే తారకరత్న ఆరోగ్యం

నారాయణ హృదయాలయ వైద్యులు వెల్లడి

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

సినీ హీరో తారకరత్న ఆరోగ్యంపై బెంగుళూరులోని నారాయణ హృదయాలయ వైద్యులు హెల్త్ బులిటెన్‌ను శనివారం విడుదల చేవారు. అత్యంత విషమ పరిస్థితిలోనే తారకరత్నను శనివారం తెల్లవారుజామున ఆస్పత్రికి తీసుకొచ్చారన్నారు. వెంటనే అత్యవసర చికిత్స అందించామని, తారకరత్నకు ప్రస్తుతం వివిధ విభాగాల నిపుణుల సమక్షంలో వైద్యం అందిస్తున్నామని చెప్పారు. ఇప్పటికీ పరిస్థితి విషమంగానే ఉందని, రానున్న రోజుల్లో మరింత మెరుగైన వైద్యం అవసరమని చెప్పారు.

ఆస్పత్రికి చేరుకున్న చంద్రబాబు

తారకరత్న ఘటన విషయం తెలిసిన వెంటనే ఫోన్‌లో ఆరా తీసిన నారా చంద్రబాబునాయుడు, శనివారం సాయంత్రం ఏడు గంటలకు హైదరాబాద్‌నుంచి బెంగుళూరులోని నారాయణ హృదయాలయను చేరుకున్నారు. వైద్యులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ పాదయాత్ర సందర్భంగా తారకరత్నకు హార్ట్ ఎటాక్ వచ్చిందని, కుప్పంలో అత్యవసర చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం నారాయణ హృదయాలకు తరలించామన్నారు. వైద్యులు శాయశక్తులా కృషి చేస్తున్నారని, అబ్జర్వేషన్‌లో ఉంచారన్నారు. వైద్యులతో తాను స్వయంగా మాట్లాడానని, కోలుకోడానికి ఇంకా సమయం పడుతుందని చెప్పారన్నారు. తారకరత్న త్వరగా కోలుకోవాలని దేవుని ప్రార్థిస్తున్నామని, ప్రస్తుతం ఐసియులో చికిత్స కొనసాగుతోందని చెప్పారు.

ఆ యాత్రలన్నీ 'అధికారం' కోసమే..!

ప్రజాశక్తి - తిరుపతి బ్యూరో

ప్రజా'దృష్టి'

రాష్ట్రంలో మూడు బూర్జువా పార్టీలు విభజన హామీల అమలుకై ఢిల్లీ యాత్ర చేపట్టలేదు.. ప్రత్యేక హోదాను సాధించడంలో నిరాహారదీక్ష చేపట్టలేదు. రాయలసీమ ప్రత్యేక ప్యాకేజీ కోసం పోరాటాలకు సిద్ధం కాలేదు.. ఎన్నికలు ఇంకా ఏడాదున్నా అధికారం కోసం అధికార వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ, ప్రతిపక్ష టిడిపి, జనసేన పార్టీలు యాత్రలు చేపడుతున్నాయి. ఈ రాష్ట్రంలో వామపక్షాలు మాత్రమే విభజన హామీ అమలు చేయాలని రాష్ట్రం విడిపోయినప్పటి నుంచి రాష్ట్ర బంద్‌కు పిలుపునిచ్చాయి. తాజాగా రాయలసీమ నుంచి 'ప్రత్యేక హోదా సాధన యాత్ర' శుక్రవారం తిరుపతికి చేరుకుంది. కేంద్రం కుట్రలను, వాస్తవ పరిస్థితులను ప్రజలకు వివరిస్తోంది.

జైళ్లకు, కేసులకు, ఈడి, ఐడి దాడులకు భయపడి ఆంధ్రాను మోసం చేసిన బిజెపిని పల్లెత్తుమాట అనకపోగా ఎవరికి వారు బిజెపి పంచన చేరేందుకు తహతహలాడుతున్న విషయం రాష్ట్ర ప్రజలకు తెలిసిందే. ఏడాదిలో ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అధికార పార్టీ 'గడప గడపకూ ప్రభుత్వం' పేరుతో వైఎస్ఆర్ కాంగ్రెస్, 'యువగళం' పేరుతో టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ కుప్పం నుంచి ఇచ్ఛాపురం వరకు పాదయాత్ర, జనసేన అధినేత పవన్‌కల్యాణ్ 'వారాహి' పేరుతో యాత్రలు చేపడుతున్నారు. 2019 ఎన్నికలకు ముందు అధికారమే ధ్యేయంగా వైఎస్ జగన్మోహన్‌రెడ్డి 3వేల కిలోమీటర్లకు పైగా యాత్రలకు శ్రీకారం చుట్టారు. అలివిగాని హామీలను గుప్పించారు. 'మాట తప్పను మడమ తప్పను' అని అధికారంలోకి వచ్చారు. తీరా నవరత్నాల పేరుతో సంక్షేమ పథకాలు తప్ప రాష్ట్రంలో ఒక్క అభివృద్ధి పని చేసింది లేదు. నిరుద్యోగులకు జాబ్‌చార్టు అమలు చేయలేదు. డిఎస్‌సి ప్రకటించలేదు. కాంట్రాక్టు కార్మికులకు కనీస వేతనం ఇవ్వలేదు. పిఆర్‌సి ప్రకటించలేదు. సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ తెస్తామని చెప్పారు. మూడు సంవత్సరాల ఎనిమిది నెలలయ్యింది. టిటిడిలోని కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేస్తామని హామీ ఇచ్చి విస్మరించారు. 25 మంది ఎంపిలను గెలిపిస్తే ఢిల్లీలో కొట్లాడి 'ప్రత్యేక హోదా' తెస్తామని చెప్పిన జగన్మోహన్‌రెడ్డి మూడున్నరేళ్లలో ఒక్కసారి కూడా కేంద్రాన్ని నిలదీసిన పాపాన పోలేదు. 'యువగళం' పేరుతో నారా లోకేష్ చేస్తున్న పాదయాత్రలోనూ అధికారం కోసమే పాదయాత్రని మేధావులు అంటున్నారు. కొత్త రాష్ట్రాన్ని కాపాడే వ్యక్తి నారా చంద్రబాబునాయుడని నవ్యాంధ్ర ఏర్పడినపుడు రాష్ట్ర ప్రజలకు పట్టం కట్టారు. అయితే ఏ సందర్భంలోనూ కేంద్రాన్ని ప్రశ్నించలేదు. ఇక వారాహి యాత్రకు బయల్దేరుతున్న పవన్‌కల్యాణ్ 'బిజెపి' రోడ్డు మ్యాప్‌లోనే వెళుతున్నారని చర్చ నడుస్తోంది. రాష్ట్రంలో ప్రధాన బూర్జువా పార్టీలైన వైఎస్ఆర్ కాంగ్రెష్, టిడిపి, జనసేనలు 'ప్రత్యేక హోదా' ఊసే ఎత్తని కేంద్రంపై కనీసం మాటమాత్రమైనా మాట్లాడే పరిస్థితులో ఆ పార్టీలు లేవు. రాష్ట్రాన్ని నిలువునా ముంచిన బిజెపి వైఖరేంటో నారా లోకేష్ 'యువగళం'లో చెప్పకుండానే జాగ్రత్తలు తీసుకోవడం గమనార్హం.

తిరుపతిలో ప్రత్యేక హోదా సాధన యాత్ర (ఫైల్‌ఫొటో)

ఎస్సీఎస్టీ సంక్షేమ పథకాలు పునరుద్ధరించాలి

ప్రజాశక్తి - తిరుపతి సిటి

రాష్ట్రంలో వైయస్ జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం వచ్చిన తర్వాత షెడ్యూల్ కులాలు, షెడ్యూల్డ్ జాతులు రాజ్యాంగ బద్ధంగా సాధించుకున్న 27 సంక్షేమ పథకాలను రద్దు చేసిందని, అదే విధంగా ఎస్సీ, ఎస్టీ ,సబ్ ప్లాన్ నిధులను జగనన్న పథకాలకు దారి మళ్లించి నిరుపేదలుగా మార్చిందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా దక్షిణ భారత అధ్యక్షులు పి.అంజయ్య విమర్శించారు. శనివారం ఎంఆర్‌పల్లిలోని యూత్ హాస్టల్లో రాయలసీమ జిల్లాల సమన్వయ సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షులు మేళం భాగ్య రావు(గుంటూరు) పాల్గొని మాట్లాడుతూ దళిత, ఆదివాసి హక్కుల్ని ఈ ప్రభుత్వం హరించడమే కాకుండా విదేశీ విద్యకు ఉన్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ పేరును తొలగించి జగన్మోహన్ రెడ్డి గా మార్చి యావత్తు యావత్ దళిత ఆదివాసీలను అవమానించిందన్నారు. ఫిబ్రవరి నెలలో దళిత ఆదివాసి జేఏసీ ఆధ్వర్యంలో తిరుపతిలో భారీ స్థాయిలో సదస్సును ఏర్పాటు చేసి వైఎస్సార్ ప్రభుత్వం విధానాలను ఎండగడతామని హెచ్చరిక చేశారు. ఏపీ

,యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షులు చందమామల కోటయ్య మాట్లాడుతూ 1000 మందిని తన సామాజిక వర్గానికి చెందిన వారికి నామినేటెడ్ పదవులు కట్టబెట్టిన ముఖ్యమంత్రి ఎస్టీ కార్పొరేషన్‌కు ఇప్పటివరకు చైర్మన్ గా ఎస్టీని నియమించకపోవడం శోచనీయమన్నారు. టీటీడీ ఎస్సీ ,ఎస్టీ ,సంక్షేమ సంఘం అధ్యక్షులు డాక్టర్ ప్రసాద్ రావు, ప్రముఖ కవి గొడుగుచింత గోవిందయ్య, సామాజిక ఉద్యమ నేత ఎస్ విశ్వనాథం, విసికె ఏ సుబ్రహ్మణ్యం, ఆర్పిఐ చిన్నం పెంచలయ్య, కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి మునిరామయ్య పాల్గొన్నారు.

30, 31 తేదీల్లో మున్సిపల్ కార్మికుల రిలేదీక్ష

ప్రజాశక్తి - గూడూరు

మున్సిపల్ కార్మికుల పట్ల కమిషనర్ నిర్లక్ష్య ధోరణిని నిరసిస్తూ ఈనెల 30, 31 తేదీల్లో రిలే నిరాహారదీక్షలు చేయనున్నట్లు కార్మిక నేతలు ప్రకటించారు. సిఐటియు కార్యాలయంలో శనివారం రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. మున్సిపల్ కార్యాలయం ముందు రెండు రోజుల పాటు రిలే నిరాహారదీక్షలు చేయాలని నిర్ణయించారు. కమిషనర్ వచ్చినప్పటి నుంచి జీతాలు వేయలేదని, జనవరి నెల పూర్తి కావస్తున్నా పట్టించుకోలేదని మున్సిపల్ కార్మికులు వాపోయారు. పనికి అవసరమైన పనిముట్లు సైతం ఇవ్వలేదన్నారు. దీర్ఘకాలికంగా మరమ్మతుకు నోచుకోని వాహనాలను రిపేర్ చేయించకపోగా 'మీరే మీ డబ్బులతో పనిముట్లు తెచ్చుకోవాలి' అని సెక్రటరీలు, మేస్త్రీలు కార్మికులమీద పెత్తనం చేస్తున్నారని తెలిపారు. తమ సమస్యలను చెప్పుకోడానికి కమిషనర్ దగ్గరకు వెళితే పారిశుధ్య కార్మికులమనే చులకన భావంతో అవమానకరంగా మాట్లాడారని, గంటల కొద్దీ నిరీక్షించేలా చేశారన్నారు. శుక్రవారం కలెక్టర్ వెంకటరమణారెడ్డిని కలిసి వినతిపత్రం ఇచ్చామన్నారు. కలెక్టర్

సానుకూలంగా స్పందించారని, సమగ్ర విచారణ జరిపిస్తామని హామీ ఇచ్చారన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సంఘం తిరుపతి జిల్లా కార్యదర్శి బి.గోపీనాథ్, గూడూరు పట్టణ కార్యదర్శి డి. కోటేశ్వరరావు, పట్టణ రైతు సంఘం నాయకులు జోగి శివకుమార్, ఎస్. ముత్యాలయ్య, సురేష్, తిరుపతి జిల్లా సి.ఐ.టి.యు. ఆటో కార్మిక సంఘం నాయకులు బి.వి.రమణయ్య, సీనియర్ నాయకులు బి.చంద్రయ్య పాల్గొన్నారు.

ఇంజినీరింగ్ విద్యార్థిని ఆత్మహత్య

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్

తిరుపతి జిల్లా నారాయణవనంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాల వసతిగృహంలో ఈసీఈ మూడో సంవత్సరం చదువుతున్న ఆర్ఎం జ్యోతి ఉరేసుకుని శనివారం ఆత్మహత్య చేసుకుంది. తోటి విద్యార్థులు కళాశాల అధ్యాపకులకు సమాచారం అందించడంతో అంబులెన్స్‌లో పుత్తూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అయితే అప్పటికే విద్యార్థిని మృతిచెందినట్లు వైద్యులు నిర్ధారించారు. అన్నమయ్య జిల్లా రాయచోటికి చెందిన జనార్ధన్‌రెడ్డి కుమార్తె ఆర్ఎం జ్యోతి తిరుపతి జిల్లా నారాయణవనంలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో మూడో సంవత్సరం ఈసీఈ చదువుతోంది. కళాశాలలోనే ఉన్న వసతి గృహంలో ఉంటోంది. అయితే శనివారం ఉదయం ఆమె కళాశాలకు వెళ్లకుండా వసతిగృహం గదిలోనే ఉండిపోయింది. సాయంత్రం తోటి విద్యార్థినులు కళాశాల నుంచి వచ్చి చూడగానే విద్యార్థిని ఉరేసుకుని ఉన్నట్లు గుర్తించారు. విద్యార్థిని ఆత్మహత్యకు గల కారణాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రథసప్తమి వేడుక

వేలాదిగా తరలివచ్చిన భక్త జనం
సప్త వాహనాలపై శ్రీవారి దర్శనం
విశేషమైన ఏర్పాట్లను చేసిన టిటిడి

ప్రజాశక్తి -తిరుమల

తిరుమలలో రథసప్తమి వేడుకను టిటిడి వైభవంగా నిర్వహించింది. సూర్యోదయం నుంచి చంద్రోదయం వరకు సప్తగిరీశుడు సప్తవాహన సేవల్లో భక్తులకు దర్శనమిచ్చారు. వాహన సేవలను తిలఖించేందుకు పెద్దసంఖ్యలో భక్తులు విచ్చేశారు. మూడేళ్ల సుదీర్ఘ కాలం అనంతరం వాహన సేవలను భక్తుల సమక్షంలో నిర్వహించడంతో భారీగా తరలివచ్చారు..దాదాపు లక్ష మంది వచ్చి ఉంటారని అంచనా. గతంలో ఎన్నడూ లేనంగా ఈ ఏడాది తిరుమల తిరుపతి దేవస్థానం కల్పించిన సౌకర్యాలపై భక్తులు సంతోషం వ్యక్తం చేశారు. మాఘశుద్ధ సప్తమినాడు... సూర్యజయంతిని పురస్కరించుకుని శనివారం తిరుమలలో రథసప్తమి వేడుకలను తిరుమల, తిరుపతి దేవస్థానం వైభవంగా నిర్వహించింది. ఉదయం ఐదున్నర గంటలకు ప్రారంభమైన వాహనసేవలు రాత్రి తొమ్మిది గంటల వరకూ కన్నులపండువగా సాగాయి. మొదటగా స్వామివారు సూర్యప్రభవాహనంపై సూర్యనారాయణమూర్తిగా ఊరేగుతూ వాయువ్య దిశకు చేరుకున్నారు. అక్కడ స్వామివారిపై సూర్యకిరణాలు తాకిన అనంతరం అర్చకులు... కర్పూర హారతులు, నైవేద్యాలు సమర్పించడంతో వాహన సేవలు ప్రారంభమయ్యాయి. సూర్యప్రభవాహన సేవ అనంతరం చిన్నశేష, గరుడ, హనుమంత వాహన సేవల్లో స్వామివారు దర్శనమిచ్చారు. మధ్యాహ్నం రెండు గంటలకు శ్రీవారి పుష్కరిణిలో చక్రస్నానం కార్యక్రమంను అర్చకులు శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవాయిద్యాలు, వేదమంత్రోచ్చరణల మద్య చక్రతాళ్వార్లకు అభిషేకాదులు,



దూప దీప నైవేధ్యాలను సమర్పించి... పుష్కరస్నానం చేయించారు. ఈ సమయంలో వేలాది మంది భక్తులు పుణ్యస్నానాలాచరించారు.

ఉదయం పూట జరిగిన వాహన సేవల్లో మలయప్పస్వామివారు మాత్రమే దర్శనమివ్వగా.... మద్యాహ్నం తరువాత కల్పవక్ష, సర్వభూపాల వాహన సేవల్లో విశేషతిరువాభరణాలు, పరిమళభరిత పూల మాలలతో అలంకతులైన శ్రీదేవీ, భూదేవీ సమేత శ్రీవారు తిరుమాడవీధుల్లో ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. సాయం సంధ్యవేళలో చల్లని వెన్నెల సమయంలో చంద్రప్రభను అధిరోహించిన తిరుమలేశుడు తిరువీధుల్లో విహరించారు. వాహనసేవల్లో కళాబందాల ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. మహిళల కోలాటాలు, చక్కబజనలు, వివిధ దేవతామూర్తుల వేషదారణలతో తిరుమాడవీధుల్లో ఆడిపాడారు. తితిదే ఎస్వీ బాలమందిరం విద్యార్థులు ఆలపించిన ఆదిత్యహదయం, సూర్యాష్టకం, సంస్కత శ్లోకాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

రథసప్తమి వేడుకలు తిలకించేందుకు పెద్ద సంఖ్యలో తరలి వచ్చిన యాత్రికులతో తిరుమాడవీధులు పూర్తిగా నిండిపోయాయి. ఉదయం ఐదు గంటలకు మాడవీధుల్లోకి చేరుకున్న భక్తులు రాత్రి చంద్రప్రభవాహనసేవ ముగిసేవరకు సప్త వాహనసేవల్లోనూ పాల్గొన్నారు. ఈ ఏడాది తిరువీధుల్లో షెడ్లను ఏర్పాటు చేయడంతో యాత్రికులు ప్రశాంత వాతావరణంలో ఉత్సవమూర్తులను దర్శించుకున్నారు.1800 మంది శ్రీవారి సేవకులతో నిరంతరాయంగా వివిధ రకాల అన్నప్రసాదాలను, మంచినీరు, మజ్జిగను అందించారు. గ్యాలరీల వద్ద సీనియర్ అధికారులతో నిరంతరం పర్యవేక్షించారు. రథసప్తమిని పురస్కరించుకుని శనివారం రద్దు చేసిన ఆర్జిత సేవలు, ప్రత్యేక దర్శనాలను తిరిగి పునరుద్దరించారు.

యోగాయే ఆరోగ్య ప్రపంచం

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

యోగాయే ఆరోగ్య ప్రపంచమని లయన్స్‌క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్‌హిల్స్ అధ్యక్షులు ఆర్కాట్ కృష్ణప్రసాద్ అన్నారు. ప్రకాశం మునిసిపల్ పార్క్ నందు లయన్స్ క్లబ్ అఫ్ తిరుపతి సెవెన్ హిల్స్, పతంజలి యోగ సమితి వారి ఆధ్వర్యంలో రథసప్తమి సందర్భంగా 108 మంది యోగ సాధకులకు 108 సూర్య నమస్కారాల ఆసనాలు నిర్వహించారు. ఆర్కాట్ కష్ణప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యాన్ని పదిలపరుచుకునే విధానాలలో యోగ చాల ముఖ్యమైనదని తెలియజేసారు. లయన్స్ క్లబ్ కార్యదర్శి జగన్నాధం మాట్లాడుతూ లయన్స్ క్లబ్ ద్వారా ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. తరువాత పతంజలి యోగ అధ్యక్షులు కైలాష్ సింగ్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో కల్తీ ఆహారంతో ఆరోగ్యం తో శరీరాన్ని పాడుచేసుకుని హాస్పిటల్స్ చుట్టూ తిరిగే కన్నా యోగ చేస్తే శరీరం, మనసు ఆరోగ్యంగా ఉంటుందని తెలిపారు .ఈ కార్యక్రమంలో పతంజలి యోగ అధ్యక్షులు కైలాష్ సింగ్, భారత్ స్వాభిమాన్ అధ్యక్షులు కుప్పయ్య, యోగ మాస్టర్ వెంకటేశ్వర్లు ,రాధికమ్మ, ప్రభాకర్ శెట్టి పాల్గొన్నారు

అభివృద్ధి పనుల పరిశీలన

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పట్టణంలోని పాత పల్లూరు, కేకేఆర్‌పురం వెళ్లే దారికి ఇరువైపులా ఉన్న ముళ్ల పొదలు, రహదారికి అడ్డుగా ఉన్న పిచ్చిమొక్కలను పురపాలక సంఘం ఆధ్వర్యంలో శనివారం జేసీబీతో తొలగించారు. అలాగే కేకేఎంపురం, పల్లూరు శ్మశాన వాటికలో ఉన్న ముళ్లపొదలను తొలగింపు పనులను పుత్తూరు మున్సిపల్ కమిషనర్. కేఎల్ ఎంఎన్ రెడ్డి పర్యవేక్షించారు. పుత్తూరు పురపాలక సంఘం పరిధిలోని కాపు వీధిలో నిర్మిస్తున్న మురుగునీటి కాలువ పనులను పరిశీలించారు. నందిమంగళం, కళ్యాణపురం లేఅవుట్‌లలో జరుగుతున్న ఇళ్ల నిర్మాణం పనులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు.

11న జాతీయ లోక్‌అదాలత్

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్ : వచ్చేనెల 11న జరగబోవు జాతీయ లోక్ అదాలత్‌ను విజయవంతం చేయాలని పుత్తూరు సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర సూచించారు. పట్టణంలోని స్థానిక కోర్టు ఆవరణలో న్యాయవాదులు, పోలీసుశాఖతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి రాఘవేంద్ర మాట్లాడుతూ అధిక సంఖ్యలో క్రిమినల్ కేసులు , సివిల్ కేసులు పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో అదనపు జూనియర్ సివిల్ జడ్జి గోపాలకష్ణ, న్యాయవాదుల సంఘం అధ్యక్షులు దామోదర్‌రెడ్డి, ఎస్సై వెంకటమోహన్, కార్వేటినగరం ఎస్సై భాస్కర్, వడమాలపేట ఎస్‌ఐ రామాంజనేయులు, న్యాయవాదులు పాల్గొన్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట ధర్నా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన ఎ.పి.ఎఫ్.ఆర్.ఎస్ రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ ఏఐటీయుసీ ఇచ్చిన పిలుపు మేరకు శనివారం పుత్తూరు మున్సిపల్ కార్యాలయం ఎదుట కార్మికులు పెద్ద ఎత్తున ధర్నా నిర్వహించారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జోరేపల్లి రామచంద్రయ్య మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికులను ఇబ్బందులకు గురిచేసేలా పలు కార్యక్రమాలను తీసుకురావడం మంచిది కాదని తీవ్రంగా విమర్శించారు. స్మార్ట్‌ఫోన్లను వాడే తెలివి కార్మికులకు ఉంటుందా అని ప్రశ్నించారు. కార్యక్రమంలో మున్సిపల్ వర్కర్స్ యూనియన్ గౌరవ అధ్యక్షులు మహేష్, నాయకులు గోపి, కష్ణారెడ్డి, యూనియన్ సెక్రటరీ హరినాథ్, ఇంజినీరింగ్ సెక్షన్ కార్యదర్శి గణేష్, ఉపాధ్యక్షులు అంకయ్య, సహాయ కార్యదర్శి యాకోబు, కోశాధికారి జయకుమార్, కమిటీ సభ్యులు వెంకట మునిజీ, ప్రభాకర్, సుధాకర్, ఎస్ సుందరం, ఎస్ బాలకష్ణ, మణెమ్మ , రమ తదితరులు పాల్గొన్నారు.

నేడు కళా ప్రదర్శనలు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు ఈ నెల 29వ తేదీన స్థానిక నెహ్రూ మున్సిపల్ హైస్కూల్ గ్రౌండ్ వేదికగా పెయింటింగ్ అండ్ డ్రాయింగ్, ఈజీ రైటింగ్, ఫ్యాన్సీ డ్రెస్ కాంపిటీషన్, భగవద్గీత, (డ్యాన్స్) గ్రూప్ అండ్ సోలో, ఫోక్ డాన్స్, మ్యూజిక్ తదితర విభాగాలలో పోటీలను నిర్వహించి 30వ తేదీన టీటీడీ మహతి కళాక్షేత్రంలో విజేతలకు బహుమతులను అందజేస్తామని భారత కళాక్షేత్రం వ్యవస్థాపకులు ధనశ్రీ శ్రీనివాస్ తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పేద విద్యార్థులను ప్రోత్సహించడమే ధ్యేయంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. బహుమతి ప్రదానోత్సవ కార్యక్రమానికి తిరుపతి జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, టీటీడీ అధికారి శేషసైలేంద్ర, మాజీ శ్వేత డైరెక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, ఎస్వీ మ్యూజిక్ కాలేజ్ హెచ్‌వోడీ ఉమా మధుబాల తదితర ప్రముఖులు హాజరవుతారని తెలిపారు.

పంచాయతీ నిధులు తిరిగివ్వాలి

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పంచాయతీలకు కేటాయించిన నిధులను తిరిగి ఇవ్వాలని పంచాయతీ ఛాంబర్ వ్యవస్థాపక అధ్యక్షులు ఎలమంచిలి వెంకటబాబు రాజేంద్రప్రసాద్ డిమాండ్ చేశారు. శనివారం తిరుపతి ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం తమ నిధులు రూ.8,660 కోట్లను దారి మళ్లించిందని.. వెంటనే తిరిగి పంచాయతీ ఖాతాలోకి జమ చేయాలన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి దోపిడే ధ్యేయంగా కొనసాగుతున్నారని ఆరోపించారు. పంచాయతీల సర్పంచులు ఎట్టి పరిస్థితుల్లో విద్యుత్ బిల్లులు కట్టవద్దని, మునుపటి తరహాలో రాష్ట్ర ప్రభుత్వమే విద్యుత్ బిల్లులు చెల్లించేలా డిమాండ్ చేయాలన్నారు. 9 తీర్మాణాల సాధనకై పోరాడుతున్నామని తెలిపారు. విలేకరుల సమావేశంలో సింగంశెట్టి సుబ్బరామయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆలయానికి స్థలాన్ని కేటాయించాలి

ప్రజాశక్తి-కోట: కోటమ్మ తల్లి పూజ కోసం గ్రామంలో ఖాళీ స్థలాన్ని కేటాయించాలని సూరిశెట్టిపాళెం మహిళలు శనివారం డిప్యూటీ తహశీల్దార్ మల్లికార్జున్‌రావు, ఎంపీడీవో భవానిలను కలిసి వినతిపత్రం అందించారు. గ్రామంలో పరిశీలించి న్యాయం చేస్తామని వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మహిళలు కోటమ్మ, స్వర్ణలత, స్నేహ తదితరులు పాల్గొన్నారు.

30న ప్రాంగణ ఎంపికలు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ఆవరణలో ఈనెల 30న ప్రాంగణ ఎంపికలు జరుగుతాయని ప్రిన్సిపల్ డాక్టర్ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జేకేసీ జవహర్ ఆధ్వర్యంలో జరిగే ఈ ఇంటర్వ్యూల్లో ఐసీఐసీఐ బ్యాంక్ రిలేషన్ షిప్ ఆఫీసర్స్ పోస్టులకు సంబంధించి రాత, మౌఖిక పరీక్షల ద్వారా అభ్యర్థుల ఎంపిక జరుగుతుందని, డిగ్రీ కోర్సులు పూర్తి చేసిన, చివరి సంవత్సరం ఫలితాల కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు అర్హులని తెలిపారు. ఆసక్తిగల విద్యార్థులు బయోడేటా, ఒరిజినల్, జిరాక్స్ సర్టిఫికెట్లతో సోమవారం ఉదయం 10 గంటలకు హాజరుకావాలని కోరారు. వివరాలకు ఫోన్‌నంబరు 8374971327 ను సంప్రదించాలని కోరారు.

యువగళం.. తరలిన టీడీపీ సైన్యం..!

పుత్తూరు: లోకేష్ పాదయాత్రకు పుత్తూరు నాయకులు

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పాదయాత్రకు నగరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు పుత్తూరు పట్టణ అధ్యక్షులు గాలి జీవరత్నంనాయుడు, ప్రధాన కార్యదర్శి ఎన్ఎన్ ధనపాల్, రాష్ట్ర తెలుగు యువత మీడియా కోఆర్డినేటర్ డీజీ ధనపాల్ ఆధ్వర్యంలో పుత్తూరు గ్రామదేవత ఆరేటమ్మ తల్లి ఆశీస్సులు తీసుకొని కుప్పానికి బయలురారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు, యువత పాల్గొన్నారు.

లోకేష్ పాదయాత్రకు సుధీర్ సంఘీభావం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: యువగళం పేరిట టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌బాబు చేపట్టిన పాదయాత్రకు శనివారం శ్రీకాళహస్తి టీడీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జల సుధీర్ రెడ్డి సంఘీభావం తెలిపారు. పాదయాత్రలో లోకేష్ వెంట నడిచి తన పూర్తి మద్దతును తెలియజేశారు. పాదయాత్ర తప్పకుండా విజయవంతం అవుతుందని, అన్ని నియోజకవర్గాల్లో టీడీపీ కార్యకర్తలు, ప్రజలు బ్రహ్మరథం పడతారని సుధీర్ అన్నారు.

యువగళం పాదయాత్రలో శ్రీకాళహస్తి ఇన్‌ఛార్జి సుధీర్‌రెడ్డి

ఉత్తమ సేవలకు జిల్లా పాలనాధికారిచే ప్రశంసాపత్రాలు

అవార్డు అందుకున్న వీఆర్‌వో భూపతి

అవార్డు అందుకున్న ప్రధానోపాధ్యాయులు ఆనందబాబు

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తన విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ తోటి సిబ్బందితో సఖ్యతగా మెలుగుతూ ప్రజలకు ప్రభుత్వ పథకాలను అందిస్తున్న తిరుపతి అర్బన్ వీఆర్‌వో భూపతికి గణతంత్ర దినోత్సవ వేడుకల్లో జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి చేతులు మీదుగా ప్రశంసాపత్రాన్ని అందించారు. వీఆర్‌వో మాట్లాడుతూ ప్రజలకు రెవెన్యూ సేవలను నిర్దేశించిన గడువులోపు పూర్తి చేస్తున్నామని తెలిపారు. నారాయణవనంలోని బాలుర జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఆనందబాబుకు గణతంత్ర దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ వెంకటరమణారెడ్డి, ఎస్పీ, డీఈవో చేతుల మీదుగా ఉత్తమ ప్రధానోపాధ్యాయుల అవార్డును అందుకున్నారు.

భ్రూణ హత్యలను నిర్మూలిద్దాం..!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: భ్రూణ హత్యల నిర్మూలనకు ప్రతిఒక్కరూ నడుం బిగించాలని ప్రముఖ న్యాయవాది రాజేశ్వరరావు పిలుపునిచ్చారు. స్థానిక ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో శనివారం లీగల్ సెల్ ఆధ్వర్యంలో భ్రూణ హత్యల నివారణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. న్యాయవాది మాట్లాడుతూ భ్రూణ హత్యల కారణంగా స్త్రీ, పురుష సమానత్వం దెబ్బతింటుందన్నారు. పురుషాధిక్యత పెరిగి మహిళలపై అఘాయిత్యాలు పెరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సృష్టికి మూలమైన ఆడపిల్లను గర్భంలోనే చంపేస్తే ఆ సష్టి మనుగడ ఎలా సాధ్యమని ప్రశ్నించారు. డాక్టర్ రమేష్ చంద్ర తదితరులు పాల్గొన్నారు.

వైభవోపేతంగా రథసప్తమి వేడుకలు



ప్రజాశక్తి-తిరుచానూరు : తిరుచానూరు శ్రీ పద్మావతి అమ్మవారి ఆలయంలో శనివారం రథసప్తమి వేడుకలు అత్యంత వైభవంగా టీటీడీ నిర్వహించింది. ఉదయం అమ్మవారిని సుప్రభాత సేవతో మేల్కొలిపి అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం సూర్యప్రభవాహనంపై ఆలయ నాలుగ మాడ వీధుల్లో అమ్మవారు విహరించారు. హంస వాహనం, అశ్వ వాహనం, గరుడ వాహనం, చిన్న శేష వాహనం, చంద్రప్రభ వాహనం, గజ వాహనాలపై ఊరేగుతూ భక్తులను కటాక్షించారు. కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో లోకనాథ్‌రెడ్డి, ఏఈవో ప్రభాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ మధుసూదన్, శేషగిరి, ఏవీఎస్‌వో శైలేంద్రబాబు, ఆలయ అర్చకులు బాబుస్వామి పాల్గొన్నారు.

అమ్మ భగవాన్‌ను దర్శించుకున్న ఛత్తీస్‌గడ్ డిప్యూటీ స్పీకర్

ప్రజాశక్తి-వరదయ్యపాళెం: అమ్మ భగవాన్ సేవకులకు ఇస్తున్న దర్శనంలో భాగంగా శనివారం నార్త్ ఇండియా నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. సుమారు 25 వేల మంది అశేష భక్త జనసందోహంతో బత్తులవల్లంలోని ఏకం ఆలయం కిక్కిరిసింది. ప్రముఖ బాలీవుడ్ నటి, మోడల్, ప్రసిద్ధ నటులు ధర్మేంద్ర, హేమమాలినిల కుమార్తె ఇషా డియోల్, ఛత్తీస్‌గడ్ డిప్యూటీ స్పీకర్ సంత్‌రామ్ నేతమ్ అమ్మ భగవాన్‌ను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. అవాంఛనీయ సంఘటనలు జరగకుండా డీఎస్పీ రవీంద్ర నాయక్, సీఐ శ్రీనివాసులు, ఎస్సై నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు. వరదయ్యపాలెం తహశీల్దార్ గౌరీశంకర్‌రావు, ఆర్ ఐ వేణుగోపాల్, వీఆర్వో సుగుణ, ఏకం కార్యనిర్వాహకులు లోకా, ఫౌండేషన్ నిర్వాహకులు కష్ణాజీ, ఆచార్య ఆనందగిరీజి, లోక ఫౌండేషన్ వైస్ ప్రెసిడెంట్ లోకేష్ దాసాజి, సునీల్‌జీ, ఉమాపతి దాసాజీ, రుద్ర దాసాజీ, శ్రీరామ్మూర్తి, దాసాజి రమేష్, దాసాజీ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

ముగిసిన వేమన జయంతి ఉత్సవాలు

ప్రజాశక్తి- రేణిగుంట: రేణిగుంట పట్టణంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో వేమన జయంతి ముగింపు సభ శనివారం ఘనంగా ముగిసింది. జన విజ్ఞాన వేదిక కన్వీనర్ వెంకటరమణ ఆధ్వర్యంలో కార్యక్రమాలను నిర్వహించారు. విశ్రాంత ఆకాశవాణి ఉద్యోగులు మల్లేశ్వరరావు, తెలుగు భాషోద్యమ నాయకులు టెంకాయల దామోదరం, రచయితలు ఓట్రా ప్రకాష్ రావు, కష్ణస్వామిరాజు, కవి నెమలిశెట్టి కిట్టన్న, నడ్డి నారాయణ పాల్గొన్నారు. మండలంలోని ఉన్నత పాఠశాలల నుంచి 63 మంది విద్యార్థులు పోటీల్లో పాల్గొనగా గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో పూర్వవిద్యార్థుల సంఘ నాయకులు జబ్బార్, సాహితీ స్రవంతి నాయకులు రమాదేవి ఇమామ్, నిర్మల, ఎంపీటీసీ రాజేశ్వరి, ఈశ్వరి, కన్వీనర్ నాగార్జున, బాలికల ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు విష్ణువర్ధనం, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రియుడి ఇంటి ఎదుట బైఠాయించిన ప్రియురాలు

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: యశోదనగర్‌లో నివాసం ఉన్న కళ్యాణ్ చేతిలో మోసపోయిన శిరీషకు న్యాయం చేయాలని ఏపీ మహిళా సంఘం జిల్లా కార్యదర్శి ఎన్ నదియా డిమాండ్ చేశారు. మహిళా సంఘం ఆధ్వర్యంలో శనివారం కళ్యాణ్ ఇంటివద్ద బాధితురాలు శిరీషతో కలిసి నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నదియా మాట్లాడుతూ కళ్యాణ్ తిరుపతిలోని ఓ ప్రైవేట్ కంపెనీలో జాబ్ చేస్తూ వారి వీధిలోనే నివాసమున్న శిరీషను ప్రేమించి పెళ్లి చేసుకుంటానని నమ్మించాడు. రెండుసార్లు ప్రెగ్నెన్సీ చేసి అబార్షన్ చేయించాడన్నారు. శిరీష పెళ్లి చేసుకోమని నిలదీయడంతో కళ్యాణ్ 'నువ్వు దళిత కులం దానివి.. తక్కువ కులానికి చెందిన వారిని మా ఇంట్లోకి రానివ్వరు.. నువ్వు దిక్కున్నచోట చెప్పుకోమని కొట్టి తరిమేశాడని తెలిపారు. బాధితురాలు తమను సంప్రదించిందని.. కళ్యాణ్ వెంటనే శిరీషను పెళ్లి చేసుకోవాలని డిమాండ్ చేశారు. శిరీష మాట్లాడుతూ కళ్యాణ్ తనను పెళ్లి చేసుకొని నాకు న్యాయం చేసేంతవరకు ఇంటి వద్దనే బైఠాయించింది. కార్యక్రమంలో మహిళా సంఘం నాయకురాలు రత్నమ్మ, ప్రమీల, విజయ, హరిత, అఖిల, అలివేలమ్మ, ఇందుమతి, బాధితురాలు శిరీష, వారి కుటుంబ సభ్యులు మద్దతు తెలిపారు.

జవహర్‌రెడ్డిని కలిసిన ఎస్వీయూ వీసీ

ప్రజాశక్తి-క్యాంపస్: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రధాన కార్యదర్శి కె.యస్. జవహర్‌రెడ్డిని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య కె. రాజారెడ్డి తిరుపతి పద్మావతి గెస్ట్ హౌస్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. విశ్వవిద్యాలయంలో సాగుతున్న బోధన, పరిశోధనాభివద్ధిని గురించి ముఖ్యకార్యదర్శి అడిగి తెలుసుకున్నారు. క్యూఎస్ ఆసియా , గ్లోబల్ ర్యాంకింగ్ లలో ఎస్వీయూ రాష్ట్రం అగ్రస్థానంలో ఉండడాన్ని, వివిధ ప్రపంచ విశ్వవిద్యాలయాలతో ఎస్వీయూ చేసుకుంటున్న ఒప్పందాలను, పొందిన పేటెంట్లను గురించి వీసీ వివరించారు.

యాచకులకు దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-గూడూరు రూరల్: గూడూరు శ్రీకష్ణ సేవా సమితి అధ్యక్షుడు , రొటేరియన్ డాక్టర్ శ్యామసుందరరావు జన్మదినం సందర్భంగా 10 మంది వద్ద యాచికులకు శనివారం ఆయన చేతుల మీదుగా దుప్పట్లు పంపిణీ చేశారు. అనంతరం గాడ్ గ్రేసే వసతి గహంలోని నిరాశ్రయలకు నెలలో ఒక రోజు క్రమం తప్పకుండా జరిగే అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులకు గ్రీన్ మ్యాట్ ను పంపిణీ చేశారు.

నకత్ ప్రవీణ్‌కు డాక్టరేట్ ప్రదానం

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని ఆంగ్ల విభాగపు పరిశోధక విద్యార్థి ఎన్.నకత్ ప్రవీణ్‌కు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు వర్సిటీ పరీక్షల నియంత్రణ అధికారి ఎం.దామ్లా నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయంలోని దూరవిద్యా విభాగపు ఆచార్యులు వి. రవినాయుడు పర్యవేక్షణలో ' నావెల్ నావెల్స్ ఆఫ్ పూలే మార్షల్ : ఏ స్టడీ ' అనే అంశంపై పరిశోధన గ్రంథాన్ని వరుసటి సమర్పించినట్లు వెల్లడించారు. ఆమె పలు జాతీయ, అంతర్జాతీయ పరిశోధన జర్నల్స్ లలో అనేక పరిశోధన వ్యాసాలను ప్రచురించారు. ఎన్. నకత్ ప్రవీణ్ కు డాక్టరేట్ అవార్డు రావడంపై పలువురు ఆచార్యులు, పరిశోధకులు, బంధుమిత్రులు శుభాకాంక్షలు తెలిపారు.

నేడు మున్సిపల్ పాఠశాలలో వైద్యశిబిరం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పట్టణంలోని తుపాన్ సెంటర్ మున్సిపల్ ప్రాథమిక పాఠశాల వేదికగా శ్రీకాళహస్తి ప్రెస్ క్లబ్, ఎంజీఎం ఆసుపత్రి సంయుక్తంగా ఆదివారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నారు. ఈ వైద్య శిబిరాన్ని తుపాన్ సెంటర్ ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంజీఎం ఆసుపత్రి డైరెక్టర్ గుడ్లూరు మయూర్ శనివారం ఒక ప్రకటనలో కోరారు.

రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి వీడ్కోలు

ప్రజాశక్తి- రేణిగుంట: జిల్లాలో రెండు రోజుల పర్యటన ముగించుకుని శనివారం రాత్రి హైదరాబాదు తిరుగు ప్రయాణం అయిన ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.ఎస్.జవహర్‌రెడ్డికి రేణిగుంట విమానాశ్రయంలో సాదరంగా వీడ్కోలు పలికారు. జిల్లా కలెక్టరు కె.వెంకటరమణారెడ్డి, జాయింట్ కలెక్టర్ డి.కె.బాలాజీ, తిరుపతి ఆర్డీవో కనకనరసారెడ్డి, గూడూరు ఆర్డీవో కిరణ్‌కుమార్, తహశీల్దార్ ఉదయ సంతోష్, డీటీలు సంతోష్, ప్రేమ్ వీడ్కోలు తెలిపిన వారిలో ఉన్నారు.

ఒబేరాయ్ హోటల్‌కు 20 ఎకరాలు కేటాయింపు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆంధ్రప్రదేశ్ పర్యాటక రంగం అభివద్ధి లో భాగంగా తిరుపతి అలిపిరి రోడ్డులో టూరిజం స్థలం 20 ఎకరాలను లీజ్ కం రెంట్ విధానంతో ఒబేరాయ్ హోటల్ యాజమాన్యంతో ఒప్పంద పత్రాలను మార్చుకున్నామని టూరిజం ఎం.డి. కన్నాబాబు అన్నారు. శనివారం అలిపిరి రోడ్డు లోని దివలోక్ వద్ద టూరిజం స్థలాన్ని లీజ్ కం రెంట్ విధానం ఒప్పంద పత్రాలను ఓబేరాయ్ హెూటల్లోని ప్రతినిధి రాజారామన్ శంకర్, టూరిజం ఎం.డి. కన్నబాబు ఒప్పందం కుదుర్చుకున్నారు. హెూటల్స్ ప్రతినిధులకు పూర్ణకుంభ స్వాగతం పలికి భూకేటాయింపు వివరించారు. రూ.100 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపట్టామని పేర్కొన్నారు. అలిపిరి వద్ద టూరిజం వారి స్థలం 50 ఎకరాలు కాగా అందులో జు పార్క్ బఫర్ జోన్ గా 7.37 ఎకరాలు, 10.32 ఎకరాలలో దేవలోక్ నిర్మాణాలు, 20 ఎకరాలలో ఓబ్ రాయ్ హెూటల్ నిర్మాణాలు సాగనున్నాయని తెలిపారు. ఓబ్ రాయ్ హెూటల్ ప్రతినిధులకు కేటాయించిన స్థలం హద్దులను చూపి వివరించారు.

30న టీటీడీ విశ్రాంత ఉద్యోగుల సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం జీవో 1153 తో 2008లో టీటీడీ ఉద్యోగులకు ఇంటి స్థలాలు ఇవ్వాలని ఆదేశాలు జారీచేసిందని టీటీడీ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు ప్రభాకర్ రెడ్డి తెలిపారు. శనివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కోర్టులో కేసు పెండింగ్లో ఉండగానే టిటిడి బోర్డు కేటాయించిన ఇంటి స్థలాలను రద్దు చేశారన్నారు. సుప్రీంకోర్టులో కేసు జరుగుతున్న తీరును టీటీడీ ఉద్యోగులకు, పెన్షనర్లకు తెలియజేయడానికి 30న టీటీడీ విశ్రాంత ఉద్యోగుల భవనంలో సాయంత్రం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నామన్నారు. సమావేశానికి విశ్రాంత ఉద్యోగులు, కుటుంబ సభ్యులు తప్పకుండా హాజరు కావాలని కోరారు. టిటిడి విశ్రాంత ఉద్యోగులు మల్లం మోహన్ రెడ్డి, జయప్రకాష్ రెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మామండూరులో పశువైద్య సేవలు

ప్రజాశక్తి-రేణిగుంట: మామండూరులో రాస్ మహిళా జ్యోతి మ్యూచువల్ బెనిఫిట్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శనివారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. రేణిగుంట ఏరియా వెటర్నరీ హాస్పిటల్ వైద్యులు డాక్టర్ స్రవంతి, రాస్ కేవీకే వెటర్నరీ డాక్టర్ అనూష సహకారంతో పశువులకు వైద్య చికిత్సలు అందించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ట్రస్టీలు సుజాత, ట్రస్ట్ ప్రాజెక్ట్ ఆఫీసర్ వెంకటేష్ ,సిబ్బంది వెంకట కుమార్, శంకరయ్య, జ్యోతి, ఇందుమతి, నాగమణి , స్వాతి, గౌతమి, గోపాలమిత్రలు మునిశేఖర్, సల్మా తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా ఉప్పల ప్రసాద్‌గౌడ్ జన్మదినం

ప్రజాశక్తి-కోట: కొత్తపట్నం పంచాయతీలో మాజీ జడ్పీటీసీ ఉప్పల ప్రసాద్‌గౌడ్ జన్మదిన వేడుకలను శనివారం ఆయన అభిమానులు ఘనంగా నిర్వహించారు. అభిమానులు, వైసీపీ నాయకులు కలిసి జన్మదినం కేక్ కోసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన్ను పూలమాలలు, శాలువాలతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు రామయ్య, రంగయ్య, ఉప్పల ప్రసాద్‌గౌడ్ అభిమానులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

సాయి నర్సింగ్ కళాశాలలో ఉద్యోగాలకు ఎంపిక

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని సాయి కాలేజ్ ఆఫ్ నర్సింగ్ కళాశాలలో కోర్సు పూర్తయిన విద్యార్థులకు కళాశాల వైస్ ఛైర్మన్ రాకేష్ కిరణ్ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి చెందిన అంకుర హాస్పిటల్ వారు రా త పరీక్షలు నిర్వహించి 35 మందిని ఎంపిక చేశారు. ఎంపికైన వారిని త్వరలోనే ఉద్యోగానికి తీసుకుంటామని హెచ్ ఆర్ ఓ మునిలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా కళాశాల వైస్ ఛైర్మన్ రాకేష్ కిరణ్ మాట్లాడుతూ తమ కళాశాలలో విద్యార్థులకు విద్య పూర్తయిన వెంటనే వివిధ సంస్థల ద్వారా ఉద్యోగాలకు పంపుతున్నామన్నారు. కార్యక్రమంలో అంకుర హాస్పిటల్ సాంబశివరావు, ఎన్ఎస్ విమల, పవన్ కుమార్, కళాశాల ప్రిన్సిపల్ రమాదేవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

సీపీఎస్ రద్దు చేయాలి

ప్రజాశక్తి-తిరుపతి సిటీ: సీపీఎస్‌ను రద్దు చేసేందుకు కృషి చేస్తామన్న వారికి ఎమ్మెల్సీ ఎన్నికల్లో తమ మద్దతు అందజేస్తున్నామని ఆంధ్రప్రదేశ్ కాంట్రిబ్యూటర్ పెన్షన్ స్కీం ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు రాగల అప్పలరాజు తెలిపారు. స్థానిక రాసి బిల్డింగ్ లో శనివారం జరిగిన ఆ సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎమ్మెల్సీ ఎన్నికల్లో సిపిఎస్ విధానాన్ని రద్దు చేస్తామన్న తూర్పు పశ్చిమ రాయలసీమ ఉపాధ్యాయ అభ్యర్థులు రమణారెడ్డి శ్రీనివాసులు రెడ్డికి తమ మద్దతు అందజేస్తామన్నారు. ఇప్పటి ప్రభుత్వం ఇప్పటి ప్రభుత్వం ప్రతిపక్షంలో ఉన్నప్పుడు తాము అధికారంలోకి వస్తే ఏడు రోజుల్లో సిపిఎస్ రద్దు చేస్తామని చెప్పారని అన్నారు కానీ అధికారంలోకి వచ్చే నాలుగు సంవత్సరాలు అవుతున్న సీపీఎస్ రద్దు చేయకపోగా జీపీఎస్ అనే పనికిమాలిన పెన్షన్ స్కీమును ప్రవేశపెట్టిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో రామాంజనేయులు, బాజీ పరాన్, జహీరాబాద్, జనార్దన్ రెడ్డి, రామనరసింహ ,ధనరాజ్, పెంచలయ్య ,శ్రీనివాసులు, కొండారెడ్డి, గోపాలప్ప , కాటసాని శివారెడ్డి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

మహారాజరాజశ్రీ తిరుపతి నాలుగవ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

ఐ.ఎ.నెం.9/2022, ఐ.ఎ.నెం.118/2022
ఓ.ఎస్.నెం.182/2011
వి.రామచంద్ర నాయుడు ...మనువుదారు/వాది
V/s
ఎస్.సుబ్రమణ్యంనాయుడు ...రెస్పాండెంట్/ప్రతివాది

Notice to the Respondent / Defendant

పై దావానందలి మనువుదారు/వాది తనకు రావలసిన బాకీ సొమ్ము నిమిత్తమై రెస్పాండెంట్ / ప్రతివాది అయిన మీ పైన, పై దావాను దాఖలు పరిచి ఉన్నారు మరియు పై కనిన దావా తేది. 03.10.2022న మనువుదారు/ వాది పేరున డిక్రీ అయి ఉన్నది. పై కనిన దావానందు పై కనిన పిటిషన్ ఐ.ఎ.నెం.9/2022, రూ.22,86,403/- విత్‌డ్రా చేసుకొనుటకు మరియు ఐ.ఎ.నెం.118/22 నందు రూ.6,44,500/- FD Amount నుండి సి.సి.డి. అకౌంట్‌కు రప్పించుటకు పై కనిన దావా నందు రెస్పాండెంట్ / ప్రతివాది అయిన మీకు నోటీసు నిమిత్తమై, వాయిదా తేది. 10.02.2023న వుంటున్నది. కావున సదరు వాయిదా రోజున పై కనిన కోర్టు వారి ఎదుట ఉదయం గం॥ 10.30 ని॥లకు మీరు నేరుగా కాని లేదా వకీలు ద్వారా కాని హాజరై మీకు గల ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించబడునని ఇందుమూలము గా మీకు తెలియజేయడమైనది.

వాయిదా: 10.02.2023
ముప్పారపు బాలకృష్ణమనాయుడు
అడ్వకేట్, తిరుపతి. సెల్ 9848209721